క్లుప్తంగా

ముత్యాలమ్మను దర్శించుకున్న భమిడిపాటి

జంగారెడ్డిగూడెం: శ్రీ ముత్యాలమ్మ అమ్మవారిని ద్వారకా తిరుమల వెంకట కామేశ్వరి జ్యోతిషాలయ అధ్యాపకుడు బ్రహ్మశ్రీ డాక్టర్ భమిడిపాటి వెంకట లక్ష్మీనారాయణ శర్మ దర్శించుకున్నారు. ముత్యాలమ్మ ఆలయంలో పౌర్ణమి సందర్భంగా ఆలయ నిర్మాణకర్త బవిరిశెట్టి మురళీకృష్ణ, పద్మ కుమారి దంపతులచే ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చండీ సప్తశతి హోమం సహిత మహా పూర్ణాహుతి కార్యక్రమాన్ని ప్రధానార్చకులు బ్రహ్మశ్రీ కె.విజయ శర్మ నిర్వహించారు. కార్యక్రమంలో మారిశెట్టి సత్యనారాయణ, బాల చిట్టెమ్మ దంపతులు, వెల్డింగ్ రంగ, జ్యోతి దంపతులు, ఎర్ర నాగేశ్వరావు సత్యా దంపతులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కుక్కునూరు: కుక్కునూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కెమిస్ట్రీ, బోటనీ సబ్జెక్టులు బోధించుటకు గెస్ట్ లెక్చరర్‌ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం ఈ విషయమై ఓ ప్రకటనను విడుదల చేశారు. సంబంధిత సబ్జెక్టులో 50 శాతం మార్కులతో పీజీ పూర్తి చేసిన ఆసక్తి గల అభ్యర్థులు 22న కళాశాల ఆఫీస్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 23న ఇంటర్వ్యూ ఉంటుందని చెప్పారు.

విజయదుర్గమ్మకు పల్లకీ సేవ

జంగారెడ్డిగూడెం: విజయదుర్గమ్మ ఆలయంలో పల్లకీ సేవ నిర్వహించారు. పౌర్ణమి పురస్కరించుకొని విజయదుర్గమ్మకు అత్యంత వైభవోపేతంగా పట్టణ పుర వీధుల్లో పల్లకీ సేవ నిర్వహించినట్లు ఆలయ శాశ్వత కమిటీ చైర్మన్ మారిశెట్టి రాధాకృష్ణ తెలిపారు. ఆలయ ప్రధాన అర్చకులు సుదర్శనం వేణుగోపాలాచార్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ శాశ్వత కమిటీ ప్రధాన కార్యదర్శి మాడా రామ్మోహనరావు, సహాయ కార్యదర్శి రామిశెట్టి శ్రీనివాసరావు, అభివృద్ధి కమిటీ అధ్యక్షులు గుడిమెట్ల యుగంధర్, ఉత్సవ కమిటీ అధ్యక్షులు యర్రం ఉదయ్ కుమార్, సభ్యులు జల్లేపల్లి శివకృష్ణ, దూసనపూడి ఏడుకొండలు పాల్గొన్నారు.

శ్రావణమాస ఆధ్యాత్మిక శోభ

కొయ్యలగూడెం: శ్రావణ మాసం మంగళవారం సందర్భంగా పలు అమ్మవార్ల ఆలయాలు, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాల వద్ద ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. బయ్యన్నగూడెంలో ప్రఖ్యాతిగాంచిన శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకులు కొత్తలంక సేవ సత్యనారాయణచార్యుల ఆధ్వర్యంలో భక్తులు సామూహిక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్న సమారాధన కార్యక్రమాలు ఆలయ ధర్మకర్త బాలం దత్తుడు పర్యవేక్షణలో నిర్వహించారు. అదేవిధంగా కొయ్యలగూడెం, కన్నాపురం, తాడేపల్లిగూడెంరోడ్డు, సుబ్రమణ్యస్వామి ఆలయాలు శ్రావణమాస శోభను సంతరించుకున్నాయి.

భారత్ బంద్‌కు సహకరించండి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాల మహానాడు నాయకులు

కొయ్యలగూడెం: భారత్ బంద్‌కు ప్రజలు సహకరించాలని మాల మహానాడు పేర్కొంది. ఎస్సీ వర్గీకరణ చేపట్టాలంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు వ్యతిరేకంగా బుధవారం భారత్ బంద్‌ను నిర్వహిస్తున్నట్లు నాయకులు తెలిపారు. మాల మహాసభ, మాల సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ, వర్గీకరణ వ్యతిరేక సంఘాలు, రాజ్యాంగ పరిరక్షణ సంఘాలు, భారత్ బంద్‌కు పిలుపునిచ్చాయన్నారు.

అవగాహన సదస్సు

వేలేరుపాడు: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దోమలను నిర్మూలించొచ్చని జిల్లా మలేరియా అధికారి పీఎస్ఎస్ ప్రసాద్ అన్నారు. వేలేరుపాడు ఎంపీడీవో కార్యాలయంలో ప్రపంచ దోమల నివారణ దినోత్సవం నిర్వహించారు. ఎంపీడీవో శ్రీహరి, వైద్యాధికారి డాక్టర్ అగతతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం ఇంటింటా ఫీవర్స్ సర్వే నిర్వహించారు.

తహసీల్దారును కలిసిన సర్పంచుల చాంబర్

కొయ్యలగూడెం: మండల తహసీల్దారుగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కె.చల్లన్నదొరను మండల సర్పంచ్‌ల చాంబర్ మంగళవారం ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసింది. సర్పంచుల చాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏలేటి చిన్న తుక్కయ్య, పోలవరం నియోజకవర్గ సర్పంచుల చాంబర్ అధ్యక్షుడు గేలం త్రివిక్రమ సోమరాజుల ఆధ్వర్యంలో సర్పంచులు తహసీల్దారును కలిశారు. పరిపాలనాపరమైన సమస్యలను పరిష్కరించడానికి పరస్పరం సహకరించుకొని ప్రజలకు చేరువ కావాలని తహసీల్దార్ సర్పంచులకు సూచించారు. సర్పంచులు కడగట్ల గడ్డియ్య, మద్దిపాటి నాగమణి, సున్నం శాంతి కుమారి, చాపల యేసు రత్నం, అడపా నాగలక్ష్మి, శ్రీను, నాగలక్ష్మి, అనంతలక్ష్మి పాల్గొన్నారు.

వాగు దాటాలంటే నీట దిగాల్సిందే


ఎర్రకాలువ ప్రధాన వాగు నీటిలో నుంచే రాకపోకలు సాగిస్తున్న దృశ్యం


పట్టెన్నపాలెంలో ఫిల్లర్ల దశలోనే నిలిచిపోయిన వంతెన

- వాగులపై వంతెనలు లేక కష్టాలు
- ప్రజలు, రైతుల రాకపోకలకు తీవ్ర అంతరాయం

జంగారెడ్డిగూడెం రూరల్: వాగులపై వంతెన నిర్మాణాలు లేక రైతులు, ప్రజలు అనేక కష్టాలు ఎదుర్కొంటున్నారు. జంగారెడ్డిగూడెం మండలంలో ఎర్రకాలువ, జల్లేరు వాగులు ప్రవహిస్తుంటాయి. ఈ వాగులు దాటాలంటే నీటిలో దిగి వెళ్లాల్సిందేనని ప్రజలు, రైతులు వాపోతున్నారు. ఈ వాగులపై వంతెన నిర్మాణాలు లేకపోవడంతో వరదల సమయంలో రాకపోకలు నిలిచిపోయి, అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. లక్కవరం నుంచి నాగులగూడెం వెళ్లే మార్గమధ్యంలో ఎర్రకాలువ వాగుపై వంతెన నిర్మాణం చేపట్టాలని అనేక సంవత్సరాలుగా రైతులు, పలు గ్రామాల ప్రజలు విన్నవించుకుంటున్నారు. పాలకుల, అధికారుల దృష్టికి తమ సమస్యలను పలుమార్లు రైతులు, ప్రజలు తీసుకెళ్లారు. ఈ వాగుపై తాత్కాలికంగా రాకపోకలు సాగించేందుకు స్థానిక రైతులే స్వచ్ఛందంగా స్తంభాలతో వంతెనను ఏర్పాటు చేసుకొని రాకపోకలు సాగిస్తుండేవారు. ఇటీవల కురిసిన వర్షాలకు తాత్కాలిక వంతెన కొట్టుకుపోయింది. దీంతో రైతులు, స్థానిక ప్రజలు మోకాళ్ల లోతు పైన నీటిలోనే ప్రమాదపు అంచున రాకపోకలు సాగిస్తున్నారు. వాగు ఉధృతంగా ప్రవహించిన సమయాల్లో రాకపోకలు నిలిచిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లక్కవరం, నాగులగూడెం గ్రామాలకు చెందిన రైతుల పొలాలు కాలువకు అవతలి వైపున ఉండటంతో నిత్యం వ్యవసాయ పనులు కోసం కాలువ దాటి వెళ్లాల్సిన పరిస్థితి ఉందని రైతులు చెబుతున్నారు. ప్రస్తుత పాలకులు, అధికారులు స్పందించి వంతెన నిర్మాణాన్ని చేపట్టాలని వేడుకొంటున్నారు. అలాగే పట్టెన్నపాలెంలో జల్లేరు వాగుపై 2017లో రూ.5 కోట్ల నిధులతో ప్రారంభించిన వంతెన పనులు సగంలోనే నిలిచిపోయాయి. ఫిల్లర్ల దశలో వంతెన పనులు ఆగిపోయాయి. వర్షాకాలంలో, తుఫాన్లు సంభవించినప్పుడు సమయాల్లో వచ్చే వరదలకు కాలువ ఉధృతంగా ప్రవహించిన సమయంలో రాకపోకలు నిలిచిపోతున్నాయి. పట్టెన్నపాలెం జల్లేరు వాగు మీదుగా నిత్యం ఏజెన్సీ, మెట్ట ప్రాంతాల ప్రజలు, రైతులు రాకపోకలు సాగిస్తుంటారు. రాష్ట్రంలో పేరు గాంచిన బుట్టాయిగూడెం మండలంలో గుబ్బల మంగమ్మ తల్లి క్షేత్రానికి కూడా ఈ వాగు దాటి వెళ్తుంటారు. వంతెన నిర్మాణ పనుల్లో భాగంగా తాత్కాలికంగా రాకపోకలు సాగించేందుకు డైవర్షన్ రహదారి నిర్మించారు. అయితే వరదల ఉధృతికి డైవర్షన్ రహదారి కొట్టుకుపోవడం, తిరిగి నిర్మించడం ఇలా అనేక సంవత్సరాలు జరుగుతూ వస్తుంది. డైవర్షన్ రహదారులు పేరిట ఇప్పటికే లక్షల్లో నిధులు కేటాయించి పనులు చేపట్టడం, వాగుల ఉధృతికి కొట్టుకుపోవడం జరుగుతూ వస్తున్నాయి. డైవర్షన్ రహదారి పేరిట వెచ్చిస్తున్న నిధులు నీటపాలవుతున్నాయే తప్ప ఎటువంటి ఉపయోగం ఉండటం లేదు. అనేక సార్లు స్థానికులు స్వచ్ఛందంగా డైవర్షన్ రహదారి మరమ్మతులు చేసిన సందర్భాలు ఉన్నాయి. జల్లేరు వాగు ఉధృతి సమయాల్లో ఏజెన్సీ, మెట్ట ప్రాంతాల ప్రజలు రాకపోకలు నిలిచిపోతున్నాయని ఇప్పటికైనా ప్రస్తుత ప్రభుత్వ పాలకులు స్పందించి వాగులపై వంతెన నిర్మాణాలు చేపట్టి ప్రజలు, రైతుల కష్టాలు తీర్చాలని వేడుకొంటున్నారు.

హమ్మయ్య.. వరద వీడింది


వంతెన అప్రోచ్‌కు మరమ్మతులు చేపట్టిన దృశ్యం

వేలేరుపాడు: ఆ గిరిజన గ్రామాలను వరద ఎట్టకేలకు వీడింది. దీంతో వేలేరుపాడు మండలంలో 18 గిరిజన గ్రామాల గిరిజనులు ఊపిరి పీల్చుకున్నారు. పోలవరం ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్ వల్ల వేలేరుపాడు నుంచి కొయిదా వెళ్లే రహదారిలో టేకూరు వాగు వద్ద వంతెనలు దాదాపుగా నెల రోజులుగా నీటమునిగిన విషయం తెలిసిందే. దీంతో అప్పటి నుంచి ఆయా గ్రామాల గిరిజనులు పడవల పైనే ప్రయాణం సాగించారు. రెండు రోజుల క్రితం ఈ రెండు వంతెనలు బయటపడినప్పటికీ వంతెనల అప్రోచ్‌లకు, రహదారులకు భారీగా గండ్లు పడ్డాయి. ఎద్దెలవాగు వంతెన అప్రోచ్‌కు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టారు. అయితే టేకూరు వాగు వద్ద భారీగా గండిపడింది, రహదారంతా ఆనవాళ్లు కోల్పోయి, ఛిద్రమైపోవడంతో మరమ్మతులకు మరో వారం రోజులు పట్టే అవకాశముందని అధికారులు చెబుతున్నారు.

ఏఐటీయూసీ వాల్ పోస్టర్ ఆవిష్కరణ


ఏఐటీయూసీ జాతీయ సమ్మేళనాల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించిన దృశ్యం

జంగారెడ్డిగూడెం: సెప్టెంబర్ 1,2, 3, తేదీల్లో ఉక్కు నగరం విశాఖపట్నంలో నిర్వహించనున్న ఏఐటీయూసీ జాతీయ సమ్మేళనాలను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కంకిపాటి బుచ్చిబాబు పిలుపునిచ్చారు.మంగళవారం జంగారెడ్డిగూడెం మండల సీపీఐ కార్యాలయంలో ఏఐటీయూసీ జాతీయ సమ్మేళనాల వాల్ పోస్టర్‌లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఐటీయూసీ సమ్మేళనాలను జయప్రదం చేయాలని కోరారు. ఏఐటీయూసీ గౌరవాధ్యక్షుడు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు జంపన వెంకటరమణ రాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రైవేటీకరణ విధానాల వలన కార్మిక హక్కులను కాలరాస్తున్న పరిస్థితిపై సుదీర్ఘంగా చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. సెప్టెంబర్ మూడో తేదీన విశాఖపట్నంలో జరుగుతున్న ఉద్యోగ కార్మికుల ప్రదర్శనకు జంగారెడ్డిగూడెం నుంచి ఉద్యోగులు, కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం అధ్యక్ష కార్యదర్శులు కె.వెంకట్రావు, బొక్కా శ్రీనివాసరావు, ఎం.సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

పశువులకు వ్యాధి నిరోధక టీకాలు


పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: గాలికుంటు, బ్రుసెల్లా వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం మంగళవారం పశు వైద్యశాఖ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ బీఎస్‌వీ శేఖర్‌దొర మాట్లాడుతూ ఈ నెల 20 నుంచి సెప్టెంబర్ 18 వరకు వ్యాధి నిరోధక టీకాలు వేస్తామన్నారు. గేదె, ఆవు జాతి పశువులలో 3 నెలల వయసు దాటిన పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేయాల్సి ఉంటుందన్నారు. బ్రుసెల్లా వ్యాధి నిరోధక టీకాలు విషయంలో 4 నుంచి 8 నెలల వయసు మధ్యలో ఉన్న గేదె, ఆవు జాతి పెయ్యి దూడలకు లేదా ఆడ దూడలకు మాత్రమే ఈ బ్రుసెల్లా వ్యాధి నిరోధక టీకాలు వేస్తామన్నారు. జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం మండలాల్లోని పాడి రైతులు తమ పశువులకు టీకాలు వేయించాలని కోరారు.

వీవోఏలను విధుల్లోకి తీసుకోవాలి


వీవోఏలను విధుల్లోకి తీసుకోవాలని వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: జిల్లాలో పలు మండలాల్లో వెలుగు వీవోఏలను అక్రమంగా తొలగించారని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ డీఆర్‌డీఏ పీడీకి వీవోఏల సంఘ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘ గౌరవ అధ్యక్షుడు డీఎస్‌వీడీ ప్రసాద్ అధికారులతో మాట్లాడుతూ ఎప్పటి నుంచో విధులు నిర్వర్తిస్తున్న వారిని కనీసం సమాచారం లేకుండా తొలగించడం సరికాదన్నారు. ఏ తప్పు లేకుండా మా ప్రభుత్వం మా ఇష్టం అన్నట్టుగా ఈ రోజున అక్రమంగా వీవోఏలను తొలగిస్తున్నారని, వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరారు. వీవోఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. దీనిపై డీఆర్‌డీఏ పీడీ స్పందించి పరిశీలన చేస్తామని తెలియజేశారు.

దోమల నిర్మూలన అందరి బాధ్యత


విద్యార్థులకు అవగాహన కలిగిస్తున్న దృశ్యం

చింతలపూడి: మానవ జాతికి దోమ ప్రధాన శత్రువుగా పరిణమించిందని, దోమల నివారణకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి ఎస్ఏ ప్రసాద్ పిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం హెల్త్ ఇన్స్పెక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ప్రపంచ దోమల నిర్మూలన దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దోమకాటు వల్ల వచ్చే వ్యాధులను గురించి అవగాహన కలిగించారు. కార్యక్రమంలో సచివాలయ హెల్త్ సెక్రటరీ బి.విజయ నిర్మల, హెల్త్ అసిస్టెంట్ సయ్యద్ జప్రుల్లా, కె.శ్రీనివాసరావు, ఐసీటీసీ కౌన్సిలర్ అశోక్‌బాబు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎన్‌జేకే నరేంద్ర, అధ్యాపకులు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి


దోమల నివారణపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పోలవరం రూరల్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అంటువ్యాధులు సోకకుండా ముందు జాగ్రత్తలు పాటించాలని పోలవరం మలేరియా సబ్ యూనిట్ అధికారి డి.నాగేశ్వరరావు తెలిపారు. ప్రపంచ దోమల నివారణోత్సవాల్లో భాగంగా మండలంలోని ఎల్ఎన్‌డీపేట, వింజరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో బోడిగూడెం ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు దోమల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మురళీధర్, డాక్టర్ కె.నిఖిల్ విద్యార్థులకు ఆరోగ్య విషయాలపై జాగ్రత్తలను తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో సోమరాజు, హెచ్‌వీ పోశమ్మ, ప్రధానోపాధ్యాయురాలు ఎస్.వాణి, తదితరులు పాల్గొన్నారు.

లేబర్ ఆఫీసర్ తనిఖీలు

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలోని పలు దుకాణాల్లో మంగళవారం సర్కిల్-2 ఏలూరు అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ జె.గోపాలకృష్ణ తనిఖీలు నిర్వహించారు. వ్యాపారుల వద్ద లేబర్ లైసెన్సులు సక్రమంగా ఉన్నాయా లేవా, కార్మికులకు వేతనాల చట్ట ప్రకారం అందిస్తున్నారా లేదా అనే అంశాలను పరిశీలించారు. దుకాణాల్లో బాల కార్మికులు ఉన్నారా అని ఆరా తీశారు. బాలలను పనిలో పెట్టుకునే వారిపై కేసులు నమోదు చేసి, చట్టపరమైన చర్యలు చేపడతామని ఈ సందర్భంగా గోపాలకృష్ణ వ్యాపారులను హెచ్చరించారు.

దోషులను కఠినంగా శిక్షించాలి


బుట్టాయగూడెం: ముంజులూరులో నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం



పోలవరం: కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: కలకత్తాలోని ఆర్‌జీకేఏఆర్ మెడికల్ కాలేజీ సెకండ్ ఇయర్ పీజీ విద్యార్థిని హత్య చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని పీడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కుర్సం లత, పీఓఎల్ డివిజన్ ప్రధాన కార్యదర్శి గురుగుంట్ల ప్రసాద్ డిమాండ్ చేశారు. మండలంలోని మారుమూల గ్రామమైన ముంజులూరులో నిర్వహించిన సభలో వారు మాట్లాడుతూ దేశంలో మహిళలు ఏ వృత్తిలో ఉన్నా వారికి రక్షణ లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పీజీ విద్యార్థినిపై జరిగిన సంఘటన అత్యంత దారుణమన్నారు. ఈ ఘటనను నిరసిస్తూ సంఘం ఆధ్వర్యంలో బుధవారం భారీ బహిరంగ సభ, నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వారు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు నడపల ముక్కారెడ్డి, సర్పంచ్ కచ్చల ముక్కారెడ్డి, బాలిరెడ్డి, అరగంటి బాబులురెడ్డి, రంగారెడ్డి, దుర్గారెడ్డి, వరలక్ష్మి, నిర్మల, తదితరులు పాల్గొన్నారు.

సంఘీభావం

పోలవరం రూరల్: కలకత్తాలో ట్రైనీ మహిళ డాక్టర్ మౌనితపై జరిగిన ఉదంతాన్ని ఖండిస్తూ మంగళవారం సాయంత్రం కూటమి నాయకులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యాలయ సమీపంలోని మహాత్మాగాంధీ విగ్రహం నుంచి ఏటిగట్టు సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి, నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కొణతాల ప్రసాద్, కరిబండి నాగరాజు, కుంచే దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థినికి నివాళి

కొయ్యలగూడెం: వైద్య విద్యార్థిని ఆత్మశాంతికి మంగళవారం రాత్రి బయ్యన్నగూడెంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కోల్‌కతాలోని వైద్య కళాశాలలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచారం ఘటనను నిరసిస్తూ ఈ కార్యక్రమం చేపట్టారు. స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కళాశాల యువతీ యువకులు పాల్గొన్నారు.

హామీలను అమలు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న బద్దా వెంకట్రావు

జంగారెడ్డిగూడెం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఇఫ్టూ జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు డిమాండ్ చేశారు. భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఆఫీస్ బ్యారర్ల సమావేశం కేవీ రమణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా గత ఎన్నికల్లో కూటమి నాయకులు ఇచ్చిన హామీల అమలుపై, ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి అంశాలపై చర్చించి ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించింది. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరణ చేస్తామని చంద్రబాబునాయుడు ప్రకటించి ఇంతవరకు అమలు చేయలేదని ఇఫ్టూ జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకటరావు విమర్శించారు. లక్షలాదిమంది నిర్మాణ కార్మికులకు ఎటువంటి సంక్షేమ పథకాలు అమలు కాలేదని, వారికి వెంటనే సంక్షేమ పథకాలు అమలయ్యే విధంగా ప్రభుత్వం సంక్షేమ బోర్డుని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ మాట్లాడుతూ ఏలూరు జిల్లాకు ఇసుక ర్యాంపు లేదనే పేరుతో నిర్మాణ యజమానులకు ఇసుక దొరకకుండా చేస్తున్నారన్నారు. అధికార పార్టీల నాయకులు ప్రజా ప్రతినిధులు తక్షణ స్పందించి జిల్లాకు నాణ్యమైన ఇసుకను అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు సరియం రామ్మోహన్ మాట్లాడుతూ తల్లికి వందనం పేరుతో విడుదల చేస్తానన్న రూ.15000 ఇంత వరకు విడుదల చేయలేదని పిల్లల స్కాలర్‌షిప్‌లు ఇవ్వకపోవడంతో ఫీజులు కట్టలేక తల్లులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వేలాదిమంది విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం చలగాటమాడుతుందన్నారు. సమావేశంలో పి.నాగేశ్వరరావు, ఈ.గ్రీష్మ, దాన వరప్రసాద్ పాల్గొన్నారు.

మానవత శాంతి ర్యాలీ



శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: మానవత సంస్థ శాంతి ర్యాలీ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటడం, ప్లాస్టిక్ నిర్మూలన, మొదలగు కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తూ విద్యార్థులతో కలిసి ర్యాలీ చేశారు. జాతీయ ప్రధాన రహదారిపై రోడ్డుకిరువైపులా మానవహారం నిర్వహించి, సేవ్ నేచర్ అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. మానవత సంస్థ ఆవిర్భావ మాసం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు అధ్యక్ష కార్యదర్శులు మాటూరు సుధీర్, కంభంపాటి సాయి పేర్కొన్నారు. ఎం.ఉమామహేశ్వరరావు, త్రిపుర సుందరి, వీఎస్ఎన్ స్వామి, ముప్పనాపల్లి వెంకటేశ్వరరావు, ఎస్‌బీజీ శేఖర్, బొమ్మ మోహన రావు, ఎస్కే అమీర్‌భాష, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

బుట్టాయగూడెం: స్థానిక విద్యారోహిణీ డిజిటల్ స్కూల్‌లో వాసవీ క్లబ్ ఆధ్వంలో ఏలూరు ఆశ్రమ మెడికల్ కాలేజీ వైద్యుల సహకారంలో మంగళవారం మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో గుండె, కిడ్నీ, ఊపిరితిత్తులు, చర్మవ్యాధులు, కళ్ల వ్యాధులు, చిన్నపిల్లల నిపుణులు, క్యాన్సర్ వ్యాధి నిపుణులు పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించారు. సుమారు 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఐదుగురికి నిత్యవసర వస్తువులను పంపిణీ చేశారు. వాసవీక్లబ్ ప్రెసిడెంట్ సబ్బిసెట్టి సత్యనారాయణ, సెక్రటరీ గట్టు మోహన్ సాయి సందీప్, ట్రెజరర్ నున్న ప్రేమ్ కుమార్, కంచర్ల రామ్మోహన్ రావు, కాకి వెంటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేత మృతికి సంతాపం

బుట్టాయగూడెం: జీలుగుమిల్లి మండలం రాచన్నగూడేనికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, సచివాలయ కన్వీనర్ శింగలదేవి సత్యనారాయణ మంగళవారం మృతి చెందారు. ఆయన మృతి పట్ల మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కన్వీనర్ తెల్లం రాజ్యలక్ష్మి సంతాపం తెలిపారు. సత్యనారాయణ వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి పార్టీ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చందాప్రసాద్, నాయకులు బోదా శ్రీనివాసరెడ్డి, వనమా రామకృష్ణ, సర్పంచ్‌లు సున్నం వరలక్ష్మి, సున్నం ఉషారాణి, కోర్సా వెంకటలక్ష్మి, చిట్టిబొమ్మ శ్రీను, వీరంకి వెంకటేశ్వరరావు, తదితరులు సత్యనారాయణ మృతికి సంతాపం తెలిపారు.

బుట్టాయగూడెం ఎస్సైగా దుర్గా మహేశ్వరరావు

బుట్టాయగూడెం: మండల ఎస్సైగా డి.దుర్గా మహేశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు ఎస్పీ కార్యాలయం నుంచి మంగళవారం రాత్రి ఉత్తర్వులు వెలువడ్డాయి. టి.నర్సాపురం ఎస్సైగా పని చేస్తున్న దుర్గా మహేశ్వరరావు ప్రస్తుతం వీఆర్‌లో ఉన్నారు. అలాగే ఇక్కడ పని చేస్తున్న ఎస్సై కె.వెంకన్న ధర్మాజీగూడెం ఎస్సై బదిలీ అయ్యారు. అదే విధంగా జీలుగుమిల్లి ఎస్సైగా పి.నవీన్ కుమార్ నియమితులయ్యారు.

నూకాలమ్మకు చండీహోమం

జంగారెడ్డిగూడెం: నూకాలమ్మ దేవస్థానంలో 66వ చండీ హోమం ఘనంగా నిర్వహించారు. శ్రావణ మాస ఉత్సవాలలో భాగంగా శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని 66వ చండీ హోమం లోక కల్యాణానికి భక్తి శ్రద్ధలతో, శాస్త్రోక్తంగా అత్యంత వైభవోపేతంగా వేద పండితులు నిర్వహించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ రాజాన సత్యనారాయణ తెలిపారు.

పరస్పరం దాడులు.. కేసుల నమోదు

ద్వారకాతిరుమల: ఇద్దరు అన్నదమ్ములు ఇంటి సరిహద్దులోని చెట్లను నరికే విషయంలో జరిగిన గొడవ పరస్పరం దాడులకు కారణమయ్యింది. పోలీసులు తెలిపిన వివరాలివీ.. మండలంలోని తిరుమలంపాలేనికి చెందిన తానంకి శేషయ్య, తానంకి శ్రీనులు అన్నదమ్ములు. వీరి ఇంటి సరిహద్దులో చెట్ల కొమ్మలు కరెంటు వైర్లకు తగులుతుండడంతో శేషయ్య గ్రామానికి చెందిన అమ్మన్న అనే వ్యక్తికి చెట్లను అమ్మాడు. దీంతో అమ్మన్న సోమవారం మధ్యాహ్నం కూలీలతో వచ్చి చెట్లను నరుకుతుండగా శ్రీను అభ్యంతరం చెప్పాడు. చెట్లు నరుకుతుండగా శ్రీను పెద్ద కుమారుడు కిరణ్ శేషయ్య మీదకు రాయి తీసుకెళ్లాడు. అడ్డుపడ్డ శేషయ్య తన తమ్ముడు రత్నరాజు తలపై కిరణ్ కొట్టి, కొడవలితో దాడి చేశాడని, తరువాత శ్రీను కుటుంబ సభ్యులు తనపై కర్రలతో దాడి చేసి గాయపరిచారని శేషయ్య పెద్ద కుమారుడు వెంకట నాగరాజు భీమడోలు ప్రభుత్వాస్పత్రిలో చేరి, ఎమ్మెల్సీ రిపోర్టు ఇచ్చాడు. ఇదిలా ఉంటే చెట్లు నరకనివ్వకుండా అడ్డుపడటంతో వెంకట నాగరాజు కత్తితో తన తలపై నరికాడని శ్రీను ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో చేరి, ఎమ్మెల్సీ ఫిర్యాదు చేశాడు. ఇద్దరి ఫిర్యాదులపై ద్వారకాతిరుమల ఎస్సై టి.సుధీర్ కేసులు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

సొసైటీ వారికే కేవైసీ చేయాలి

ద్వారకాతిరుమల: ఇతర ప్రాంతాల్లోని రైతులకు స్థానిక సొసైటీల్లో కేవైసీ చేయడం సరికాదని వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు పాకలపాటి తాగ్య భీమేశ్వరరావు అన్నారు. ప్రభుత్వ ఆదేశాలతో జిల్లా వ్యాప్తంగా సహకార సంఘాల్లోని రైతులకు, సభ్యులకు కేవైసీ చేస్తున్నారు. ఈ కేవైసీ ఆధార్ కార్డు, పాన్ కార్డు, డీసీసీబీ బ్యాంకు పాస్ పుస్తకం తోపాటు ఫొటోల ఆధారంగా చేయాల్సి ఉంది. మండలంలోని రామన్నగూడెం సొసైటీలో ఒక్క ఆధార్ కార్డు ఆధారంగా కేవైసీ చేస్తున్నారని, అది సరికాదన్నారు. ఈ విషయంపై కలెక్టర్‌కు, సొసైటీ, మండల అధికారులకు ఫిర్యాదు చేసినట్టు చెప్పారు.